ఆదుకొంటేనే కోకో సాగు విస్తరణ

- మెట్టలో ఆసక్తి చూపుతున్న రైతులు
- కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని మొర
- కనీస మద్దతు ధర, రాయితీలతో ప్రోత్సహిస్తే మంచి ఫలితాలు


తేటగుంటలో కొబ్బరిలో అంతర పంటగా సాగు చేస్తున్న కోకో తోటలు


చెట్లకు కాసిన కోకో కాయలు

తుని రూరల్: వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తి పెంచాలంటే కోకో సాగుదారులను ప్రభుత్వాలు ప్రోత్సహించాలి. కంపెనీలు రైతులకు గిట్టుబాటు ధర చెల్లించి గింజలను కొనుగోలు చేస్తే సాగు విస్తరణ సాధ్యమవుతుంది. ప్రస్తుతం కోకో రైతులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఆ సమస్యలను పరిష్కరించడంతో పాటు అంతర్జాతీయ అవసరాలు, నాణ్యత ఆధారంగా గిట్టుబాటు ధర చెల్లిస్తే ఉత్సాహంతో రైతులు సాగువైపు మొగ్గు చూపుతారు. ఆ దిశగా కంపెనీలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందడుగు వేయాలని రైతులు కోరుతున్నారు.

భరోసా కరవు

ప్రస్తుతం మొక్కలు ఇచ్చి గింజలు కొనుగోలు చేసేందుకే కంపెనీలు పరిమితమయ్యాయి. మొక్కలు తెచ్చుకుని గింజలు ఉత్పత్తి చేసి విక్రయించే వరకూ రైతులకు భరోసా కల్పించే వ్యవస్థ కరువయ్యింది. దీంతో గిట్టుబాటు ధర, మార్కెట్ సదుపాయాలు, నాణ్యతగల దిగుబడుల సాధనపై రైతుల్లో అవగాహన కొరవడింది. ఫలితంగా సాగు విస్తరణ ఆశించిన స్థాయిలో ఉండడం లేదు. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో క్వింటాల్ కోకో గింజల ధర రూ.1100 వరకు ఉండగా స్థానిక రైతులకు రూ.600 నుంచి రూ.700 వరకూ మాత్రమే దక్కుతుంది. ఈ వ్యత్యాసం తగ్గించేందుకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి, జోనల్ విధానాన్ని అమలు చేస్తే మేలు జరుగుతుంది. కోకో సాగులో కీలకమైన ఎరువుల నిర్వహణ, కొమ్మల కత్తిరింపు, నాణ్యత, గ్రేడింగ్, ఉపాధి హామీ పథకం అనుసంధానంపై ప్రోత్సాహకాలు అందిస్తే విస్తీర్ణం పెంపులో సత్ఫలితాలు వస్తాయి.

ఫ్యాక్టరీ జోన్ మేలు

ఉభయ గోదావరి జిల్లాల్లో కోకో ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలు లేవు. దీంతో క్షేత్రస్థాయిలో కోకో సాగును ప్రోత్సహించే వ్యవస్థ కొరవడింది. ఆయిల్ పామ్ వ్యవస్థ మాదిరిగా కోకో ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ, జోన్ ఏర్పాటు చేస్తే యాజమాన్యం రైతులకు అండగా నిలిచే అవకాశం ఉంది. సాగుదారులు ఎప్పుడు ఏం చేయాలో తెలియజేసే అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. ఫలితంగా రైతుల్లో నమ్మకం ఏర్పడి సాగుపై మరింత ఆసక్తి చూపుతారు. కోకో గింజల ఉత్పత్తి తర్వాత గ్రేడింగ్ చేస్తే నాణ్యత ఆధారంగా మంచి ధర పొందే అవకాశాలు ఉంటాయి.

అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్

అంతర్జాతీయంగా కోకో సాగు ఒడుదొడుకులను ఎదుర్కొంటోంది. వాతావరణ మార్పుల కారణంగా గడిచిన రెండేళ్లుగా పశ్చిమ ఆఫ్రికా దేశాల్లో కోకో దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయి. దీంతో దేశంలో కేరళ, కర్ణాటక, తమిళనాడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పండిస్తున్న కోకో గింజలకు డిమాండ్ పెరిగింది. దీంతో క్వింటాల్ కోకో గింజల ధర రూ.300 నుంచి రూ.వెయ్యి వరకు పలికి రైతులకు గిట్టుబాటు ధర లభిస్తోంది. ఇదే విధంగా గిట్టుబాటు ధర లభిస్తే రైతులు కోకో సాగుపై ఉత్సాహం చూపిస్తారు. అందుకు అనువైన వాతావరణాన్ని, పరిస్థితులను ప్రభుత్వం కల్పించాల్సి ఉంది. అధికారంలో ఏ ప్రభుత్వం ఉన్నప్పటికీ ఉద్యాన పంటలపై ఒకే విధానం కొనసాగించాలని రైతులు కోరుతున్నారు.

దళారీ వ్యవస్థ పోవాలి



తేటగుంటలో ఐదెకరాల్లో కోకో సాగు చేస్తున్నాను. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లభించడం లేదు. పండించిన గింజలకు కంపెనీ సరైన ధర చెల్లించడం లేదు. విధిగా కొనుగోలు చేయడం లేదు. దళారులకు విక్రయించాల్సి వస్తుంది. కంపెనీ ధర కంటే దళారులు అధికంగా ధర చెల్లిస్తుండడం ఆందోళన కలిగిస్తుంది. దళారుల వ్యవస్థ పోవాలి. సంవత్సరం మొత్తం ఎంఎస్‌పీ ధరకు కంపెనీయే కొనుగోలు చేయాలి.

– కోలా సతీష్, కోకో రైతు, తేటగుంట

జోనల్ వ్యవస్థ ఏర్పాటుపై దృష్టి



కోకో సాగు విస్తీర్ణం, దిగుబడులు పెంపు, ఫ్యాక్టరీ, జోనల్ వ్యవస్థల ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందుకు ఐఐపీఎం బృందాన్ని నియమించింది. చాక్‌లెట్ల తయారీకే కాకుండా ఉప ఉత్పత్తులపై రైతులు అవగాహన పెంచుకుని గింజల్లో నాణ్యత, అధిక దిగుబడులు పెంచాలి. సాగులో మెళకువలు, సలహాలు, సూచనలకు అందుబాటులో ఉన్న ఉద్యాన అసిస్టెంట్లు, అధికారుల సేవలను వినియోగించుకోవాలి.

– జి.విజయలక్ష్మి, ఉద్యాన అధికారి, తుని

క్లుప్తంగా

నల్లరాయి క్వారీ నిర్వహణపై ప్రజాభిప్రాయ సేకరణ


ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న అధికారులు

రౌతులపూడి: సబ్‌ప్లాన్ ఏజెన్సీకి చెందిన రాఘవపట్నంలో నల్లరాయి క్వారీ నిర్వహణకు ఏఎంఆర్ ఇండియా లిమిటెడ్ కంపెనీ దరఖాస్తు చేసుకుంది. ఈ నేపథ్యంలో గురువారం అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఈఈ ఎంబీఎస్ శంకరరావు ఆధ్వర్యంలో రాఘవపట్నం శివారు మాతయ్యపేటలో ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల కోరిక మేరకు ఉపాధి, రహదారుల నిర్మాణం, తాగునీరు, వైద్యం, వంటి మౌలిక వసతుల కల్పిస్తామని నిర్వాహకులు హామీ ఇచ్చారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా క్వారీ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ జె.వెంకట్రావు, తహసీల్దార్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కొండరాజులబాబు జాతర


రమణయ్యపేటలో కొండరాజులబాబు

ఏలేశ్వరం: భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కొండరాజులబాబు జాతరను గురువారం రమణయ్యపేటలో ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలతో పాటు ఏజెన్సీ ప్రాంతానికి చెందిన వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కాగా వచ్చే నెల 20వ తేదీ వరకూ స్వామివారి తీర్థ మహోత్సవం నిర్వహిస్తారు. ప్రతి శుక్రవారం గ్రామంలో భక్తులు పండగలు చేస్తారు. జాతరలో డప్పుల మేళం, లక్కగుర్రాలు, కొమ్ములాట, గరగల నృత్యాలు, బాణసంచా కాల్పులు ఆకట్టుకున్నాయి. శుక్రవారం స్వామివారి తీర్థ మహోత్సవం నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ తెలిపింది. తీర్థానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు.

సారా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

ప్రత్తిపాడు: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని గ్రామాల్లో సారా స్థావరాలపై గురువారం విస్తృతంగా దాడులు నిర్వహించినట్టు ప్రత్తిపాడు ఎక్సైజ్ సీఐ పి.శివ ప్రసాద్ తెలిపారు. శంఖవరం మండలం మండపం గ్రామంలోని సారా బట్టీలపై దాడి చేసి సారా తయారీకి సిద్ధం చేసిన 800 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. ఎక్సైజ్ ఎస్సై పున్నం వంశీరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం


రంపయర్రంపాలెంలో కాలిపోతున్న గడ్డివామి

గోకవరం: మండలంలోని రంపయర్రంపాలెంలో గురువారం గడ్డివామి దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే... గ్రామశివారున గంగంపాలెం వెళ్లే మార్గంలో చిక్కిరెడ్డి కాటమస్వామికి చెందిన గడ్డివాము నుంచి మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే మంటలు అదుపు చేసే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే గడ్డివామి పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.50 వేల విలువ గల గడ్డి నష్టపోయినట్టు బాధిత రైతు తెలిపారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలి

శంఖవరం: ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కత్తిపూడిలోని వర్తక సంఘం కల్యాణ మండపంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ అభ్యర్థి పేరాబత్తులకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. నియోజకవర్గ ప్రత్యేక పరిశీలకులు గొంప కృష్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

క్యాన్సర్ నివారణపై అవగాహన

గండేపల్లి: ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సూరంపాలెం ఆదిత్య ఫార్మసీ కళాశాలలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ కె.రవి శంకర్ తెలిపారు. మెడికోవర్ హాస్పిటల్‌లో రేడియేషన్ ఆంకాలజీ డాక్టర్ ఎం. పృథ్వీరాజ్ క్యాన్సర్ నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ పి. ప్రశాంతి, జె.అనుప్రవల్లిక, ఎస్.శృతి పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న గిరి ప్రదక్షిణ


తంటికొండలో గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్న భక్తులు


గోకవరం: మండలంలోని తంటికొండలో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 4వ రోజు గురువారం గిరి ప్రదక్షిణ ఘనంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి తూర్పుమెట్ల భాగం నుంచి కొండ కిందకు తీసుకువచ్చారు. వెంకటగిరి చుట్టూ ప్రదక్షిణ నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, మేళతాళాల నడుమ గోవింద నామస్మరణతో భక్తులు గిరి ప్రదక్షిణ చేశారు. అనంతరం ఆలయంలో స్వామివారి స్వయంభూ నిజపాదముద్ర వద్ద ప్రత్యేక పూజలు జరిపారు. లక్ష్మీనారసింహ సహిత మహా సుదర్శన హోమం నిర్వహించారు. సాయంత్రం నవగ్రహ హోమం, నిత్యోపాసన, బలిహరణ వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం మాజీ చైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్నదొర, ఈఓ వడ్డాది సత్యన్నారాయణ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

హైస్కూల్‌కు బీరువా బహూకరణ


కామరాజుపేట జెడ్పీ హైస్కూల్‌కు బీరువాను అందిస్తున్న పూర్వ విద్యార్థులు

గోకవరం: మండలంలోని కామరాజుపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌కు పూర్వ విద్యార్థులు బీరువా బహూకరించారు. పాఠశాలకు చెందిన 2004–05 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సుమారు రూ.10 వేల విలువ గల బీరువాను గురువారం స్కూల్ హెచ్‌ఎం ఎస్. ఈశ్వరీదేవికి అందజేశారు. తాము చదువుకున్న పాఠశాలకు పూర్వ విద్యార్థులు సహకారం అందించడం అభినందనీయమని హెచ్‌ఎం కొనియాడారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వి.సూర్యకుమార్, కె.ప్రసాద్, ఉపాధ్యాయులు వి.మేరీమాత, పెదిరెడ్ల రాజు, చక్రధర్, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ కోర్సులపై విద్యార్థులు దృష్టి సారించాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చెన్నారావు

తొండంగి: విద్యార్థులు మారుతున్న కాలానికి అనుగుణంగా స్కిల్ కోర్సులపై దృష్టి సారించాలని పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వీకే మెహర్ సూచించారు. ప్రభుత్వ విద్యాశాఖ మార్గదర్శకాల ప్రకారం ఓపెన్ డే సందర్భంగా ఒంటిమామిడిలో త్రిపుర జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో చేరాలన్నారు. చదువుతో పాటు స్కిల్ కోర్సుల నేర్చుకోవడంతో త్వరితగతిన ఉద్యోగం సాధించే అవకాశాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో త్రిపుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.మల్లేశ్వరరావు, కరస్పాండెంట్లు బెక్కం నాగన్న, చెరుకూరి శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా ఓపెన్ డే

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ చెన్నారావు ఆధ్వర్యంలో గురువారం ఓపెన్ డే కార్యక్రమం నిర్వహించారు. స్థానిక జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొని కళాశాలలో అధునాతన తరగతి గదులు, సైన్స్ గ్రంథాలయం, క్రీడా మైదానం, ఇతర సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చెన్నారావు మాట్లాడుతూ విద్యార్థులకు డిగ్రీ కళాశాలలో సౌకర్యాలు, రూ.12 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు, ఆధునిక వసతులను వివరించారు. డిగ్రీ కళాశాలలో అనేక కొత్త కోర్సులు ప్రవేశపెట్టామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మేధో సంపత్తి హక్కులపై నేడు వర్క్‌షాపు

తుని రూరల్: మండలంలోని వి.కొత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) ఆధ్వర్యంలో మేధో సంపత్తి హక్కులపై శుక్రవారం వర్క్ షాప్ నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ లలిత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వర్క్‌షాప్ నిర్వహిస్తామన్నారు. రాజీవ్ గాంధీ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంటిలెక్చువల్ ప్రాపర్టీ మేనేజ్‌మెంట్ (ఆర్‌జీఎన్ఐఐపీఎం–నాగపూర్) గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో ఈ వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్టు వివరించారు. విద్యార్థులు, వైజ్ఞానికులు అధికారిక వెబ్‌సైట్లో రిజిస్ట్రేషన్ చేసుకుని వర్క్‌షాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

కోటనందూరు: పట్టభద్రులు తమ ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి హసన్ షరీఫ్ విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఆయన కోటనందూరులో పర్యటించారు. స్థానిక పట్టభద్రులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను గెలిపిస్తే ప్రైవేటు కంపెనీల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానిక పట్టభద్రులకే ఇవ్వాలని గత ప్రభుత్వం తెచ్చిన చట్టం అమలు, గోదావరి జిల్లాల్లోని ప్రతి మండలంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. త్వరలో పట్టభద్రుల భవిష్యత్‌ను కోరుతూ కాకినాడ నుంచి సైకిల్ యాత్ర ప్రారంభిస్తానని చెప్పారు. కార్యక్రమంలో జిగటాల కోటసత్తిబాబు, జిగటాల వీరబాబు, తోలెం విజయ్‌రాజు, కొత్తపల్లి మాణిక్యలరావు తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను పెంపొందించుకోవాలి

గండేపల్లి: విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ పి.కృష్ణారావు సూచించారు. మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించే వెబ్ డెవలప్‌మెంట్, డిజైన్ థింకింగ్ ఫర్ ఎస్‌డీసీ వర్క్‌షాపును గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నైపుణ్యాలు మెరుగుపరచుకునేందుకు ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.నరేష్, డైరెక్టర్ ఎంవీ హరనాథబాబు తదితరులు పాల్గొన్నారు.

ట్రంప్ చర్యలను ఖండించకపోవడం దారుణం

జగ్గంపేట: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అమానుష చర్యలను భారతదేశం ఖండించకపోవడం దారుణమని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. ట్రంప్ అమానుష చర్యలను ఖండిస్తూ జగ్గంపేట ట్రావెలర్స్ బంగ్లా వద్ద గురువారం నిరసన తెలిపారు. భారతీయుల చేతులకు సంకెళ్లు వేసి ఇండియాకు పంపినా భారతదేశం మౌనం వహించడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

జగపతినగరంలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్

కిర్లంపూడి: పరిశుభ్రతే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు జగపతినగరం సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత తెలిపారు. జగపతినగరంలో గురువారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. శానిటేషన్ సిబ్బంది డ్రైనేజీలను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారు. వీధులు, గుబురుగా ఉన్న ప్రదేశాల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. సీజనల్ వ్యాధులు రాకుండా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్నట్టు సర్పంచ్ తెలిపారు.

స్వామివారికి లక్షపత్రి పూజ


విశేష అలంకరణలో స్వామివారు

జగ్గంపేట: స్థానిక నెహ్రూ కాలనీలోని లక్ష్మీ గణపతి ఆలయంలో కొలువుదీరిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి గురువారం లక్షపత్రి పూజ నిర్వహించారు. స్వామివారి జన్మ నక్షత్రం కృతిక సందర్భంగా ఆలయ అర్చకుడు పురాణపండ శేష సాయి శర్మ ఆధ్వర్యంలో తొమ్మిది మంది రుత్విక్కులు లక్షపత్రి పూజ, విశేష అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఉపాధ్యాయులకు సత్కారం


బెండపూడిలో ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

తొండంగి: మండలంలోని బెండపూడి జెడ్పీ హైస్కూల్ విద్యార్థి కె.బలరామ్‌శివ రూపొందించిన ప్రాజెక్టు రాష్ట్రస్థాయి సైన్స్ పదర్శనలో విజయం సాధించి జాతీయస్థాయి ఎంపికైంది. దీంతో ఆ విద్యార్థిని ప్రోత్సహించిన ఉపాధ్యాయులను గురువారం ఘనంగా సన్మానించారు. బలరామ్‌సాయి ఇటీవల గణతంత్ర దినోత్సవం సందర్భంగా గవర్నర్ షేక్ నజీర్ ఎట్ ది హోమ్ విందుకు హాజరయ్యాడు. కాగా బలరామ్ శివను ప్రోత్సహించిన హెచ్‌ఎం నాగం కృష్ణమూర్తి, సైన్స్ ఉపాధ్యాయులు కె.సత్యశ్రీ, ఐ.భారతి, డి.నాగజ్యోతి, సీహెచ్.రూపలను పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు వీరే..

ఏలేశ్వరం: వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ మండల అధ్యక్షులు నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మండల అధ్యక్షుల నియామకం జరిగింది. ఏలేశ్వరం నగర పంచాయతీ అధ్యక్షుడిగా శిడగం వెంకటేశ్వరరావు, ఏలేశ్వరం మండల అధ్యక్షుడిగా గొల్లపల్లి సురేష్, ప్రత్తిపాడు మండల అధ్యక్షుడిగా రామిశెట్టి బుల్లి రామకృష్ణ, శంఖవరం మండల అధ్యక్షుడిగా నరాల శ్రీనివాసరావు, రౌతులపూడి మండల అధ్యక్షుడిగా చింతకాయల వీరవెంకట సత్యనారాయణలను నియమించారు. వీరి నియామకం పట్ల పార్టీశ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.

కిశోరి వికాసంపై శిక్షణ


సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలత

తుని: స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో కిశోరి వికాసంపై గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పీడీ విజయకుమారి మాట్లాడుతూ కిశోరి వికాసం ఫేజ్–2 కార్యక్రమంలో భాగంగా పట్టణ పరిధిలోని కిశోర బాలికలను గ్రూపులుగా విడదీసి వారికి పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. కిశోర బాలికల పోషణ, వ్యక్తిగత పరిశుభ్రత, పోక్సో చట్టం, బాల్య వివాహాలు, బాలల రక్షణ తదితర అంశాలపై సీడీపీఓ కె.శ్రీలత శిక్షణ ఇచ్చారు. శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాలల పరిరక్షణ అధికారి వెంకటరావు, మున్సిపల్ కమిషనర్ వెంకటరావు, ఎస్సై విజయ్‌బాబు, మెడికల్ ఆఫీసర్ శృతి, ఏసీడీపీఓ నిహారిక, అడ్వొకేట్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

అందుబాటులోకి ఖరీదైన ఇంజక్షన్

ప్రత్తిపాడు: గుండెపోటు వచ్చిన వ్యక్తి ప్రాణాన్ని సంరక్షించే టినెక్టిప్లస్ ఇంజక్షన్ ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో అందుబాటులో ఉందని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ బి.సౌమ్యమైఖేల్ గురువారం తెలిపారు. గుండెపోటు వచ్చిన వ్యక్తికి గంటలోపు ఈ ఇంజక్షన్ ఇవ్వడం ద్వారా ప్రాణాన్ని కాపాడవచ్చని చెప్పారు. సుమారు రూ.50 వేల ఖరీదు చేసే ఈ ఇంజక్షన్ కోసం గతంలో రోగులు ప్రైవేటు ఆసుపత్రులకు పరుగులు పెట్టేవారన్నారు. ఇకపై ఆ ఇంజక్షన్ సీహెచ్‌సీలో ఉచితంగా పొందవచ్చని చెప్పారు. మొదటి గంట లోపు చాతి నొప్పి, ఎడమ భుజం లాగడం, ఆకస్మిక ఆయాసం, గుండె దడ, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే గుండెపోటుకు కారణాలు కావచ్చన్నారు. ఇటువంటి లక్షణాలను గుర్తిస్తే వెంటనే ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. ఈ లక్షణాలు ఉన్నవారు ఆస్పత్రికి రాగానే ప్రాథమిక పరీక్షలు నిర్వహించి, మొదటి గంటలోనే టినెక్టిప్లస్ ఇంజక్షన్ ఉచితంగా ఇస్తామన్నారు. సీహెచ్‌సీలో 24 గంటలూ వైద్యం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆమె భరోసా ఇచ్చారు. ఈ వైద్య విధానంపై సీహెచ్‌సీ పరిధిలో ప్రజలకు అవగాహన కల్పించాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు.

ఉపాధి పనుల పరిశీలన


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ నాతి బుజ్జి

గండేపల్లి: మండలంలోని మురారిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఎంపీడీఓ నాతి బుజ్జి తనిఖీ చేశారు. కూలీల మస్తర్లు, రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రతి కూలీకి వంద రోజులు పని దినాలు కల్పిస్తామని, పనితగ్గ వేతనం పొందాలన్నారు. అనంతరం గ్రామంలోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్డును పరిశీలించారు. ఆమె వెంట ఈసీ రమేష్, పంచాయతీ కార్యదర్శి శిరీష, టీఏ శ్రీనుబాబు, సిబ్బంది ఉన్నారు.

ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలి

గండేపల్లి: ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ నాతి బుజ్జి ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎన్ఆర్‌జీఎస్ సిబ్బందితో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి కూలీలకు 100 రోజుల పనిదినాలు కల్పించాలని, ప్రతి కూలీకి రూ.300 వేతనం వచ్చే విధంగా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ గంగాభవాని, ఈసీ రమేష్, టీఏ, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

హాస్టళ్ల మరమ్మతులకు రూ.3.78 కోట్లు


గోకవరం బాలుర వసతి గృహంలో విద్యార్థులతో మాట్లాడుతున్న శోభారాణి

సాంఘిక సంక్షేమ శాఖ తూర్పుగోదావరి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ శోభారాణి

గోకవరం: తూర్పుగోదావరి జిల్లాలో 24 సోషల్ వెల్ఫేర్ వసతి గృహాలకు రూ.3.78 కోట్ల నిధులు మంజూరయ్యాయని సోషల్ వెల్ఫేర్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఎంఎస్ శోభారాణి తెలిపారు. మండలంలోని గోకవరం బాలుర, కొత్తపల్లిలోని బాలికల వసతి గృహాలను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలో మెనూ, ఇతర సమస్యలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. గోకవరం వసతి గృహంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 37 సోషల్ వెల్ఫేర్ వసతి గృహాలు ఉన్నాయన్నారు. వీటిలో 24 భవనాలకు వివిధ రిపేర్లు నిమిత్తం రూ.3.78 కోట్లు నిధులు మంజూరయ్యాయని, ఎన్నికల కోడ్ కారణంగా ప్రస్తుతం పనులు ఇంకా ప్రారంభించలేదన్నారు. ఆరు వసతి గృహాలు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ఒక్కొక్క భవనం అభివృద్ధికి రూ.3 కోట్లు పీఎంజీఏవై నిధుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. గోకవరం వసతి గృహం మరమ్మతులకు రూ.17.05 లక్షలు మంజూరయ్యాయన్నారు. వీటిలో రూ.8.35 లక్షలతో భవనంలో మైనర్ రిపేర్లు, రూ.8.70 లక్షలతో భవనం శ్లాబ్‌కు మరమ్మతులు చేస్తామని తెలిపారు. ఆమె వెంట ఏఎస్‌డబ్ల్యూ ఎం.సందీప్, వార్డెన్ రామకృష్ణ తదితరులు ఉన్నారు.

విగ్రహ ప్రతిష్ఠకు చురుగ్గా ఏర్పాట్లు

- 17న ఇర్రిపాకలో శివకేశవుల విగ్రహాల ప్రతిష్ఠ
- ఏర్పాట్లను పరిశీలించిన పురోహితులు


ఇర్రిపాకలో శివకేశవుల విగ్రహ ప్రతిష్ఠ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే నెహ్రూ, పురోహితులు

జగ్గంపేట: ఏలేరు నది తీరంలో ఈ నెల 17న శివకేశవుల విగ్రహాల ప్రతిష్ఠకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఇర్రిపాకలోని ఏలేరు నది తీరం మంచి ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోందని, ఇక్కడ శివకేశవుల విగ్రహాలను ప్రతిష్ఠించాలని శృంగేరి శారదా పీఠం ఉత్తరాధికారి జగద్గురు శంకరాచార్య విధుశేఖర భారతీమహాస్వామి సూచించడంతో టీటీడీ మెంబర్, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ దీనికి సంకల్పించారు. ఇర్రిపాకలో గతేడాది ఏలేరు నది తీరంలో ద్వాదశ జ్యోతిర్లింగాలను ప్రతిష్ఠించి కోటి పార్థివ శివలింగాలతో మహా కుంభాభిషేకం నిర్వహించారు.

తొమ్మిది అడుగుల కోటిలింగేశ్వరస్వామి

శృంగేరి పీఠాధిపతి సూచన మేరకు తొమ్మిది అడుగుల ఏక లింగాన్ని కోటిలింగేశ్వరస్వామిగాను, ఏడు అడుగుల వేంకటేశ్వరస్వామి ఏకశిల విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. ఈ నెల 12 నుంచి పూజాది కార్యక్రమాలు ప్రారంభించి, 17న విగ్రహాలను ప్రతిష్ఠిస్తారు. కాగా ఏలేరు నది తీరంలో ఏర్పాట్లను ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, విగ్రహ ప్రతిష్ఠ చేసే యాజ్ఞికులు, పురోహితులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా యాజ్ఞిక బ్రహ్మ పాణింగపల్లి పవన్ కుమార్ ఆచార్యులు మాట్లాడుతూ శృంగేరి మహాస్వామి అనుగ్రహ సూచన, ఆశీస్సులతో ఈ విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నిరంజన ఆచార్యులు, కామేశ్వర శర్మ, బోదిరెడ్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.